సాక్షి మహబూబాబాద్

మంగళవారం । 21 । ఫిబ్రవరి । 2023



దొంగల ముఠా అరెస్ట్

మరిపెడ మీదుగా గంజాయి తరలిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు రూ.7.50లక్షల విలువైన సరుకును స్వాధీనం చేసుకున్నారు. - 8లో▸



మార్కెట్ సమస్యలు..

వరంగల్ మార్కెట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయికి చాంబర్ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
35.4^0/19.2^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. కాస్త చలి తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బాధితులకు న్యాయం చేయండి



మహబూబాబాద్ రూరల్: బాధితులకు భరోసాగా నిలబడి వారికి న్యాయం చేయడమే పోలీసుల కర్తవ్యమని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి రోజు ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని, బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు ఉదయం 11నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో అందుబాటులో ఉంటానని ఎస్పీ తెలిపారు. ప్రజల రక్షణ కోసమే అనునిత్యం పోలీసులు పని చేస్తున్నారని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించడంలో పోలీసులు ముందుండాలన్నారు. ప్రజలకు న్యాయం జరిగేలా చూడడమే పోలీసుల కర్తవ్యం అన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందేలా ప్రతి పోలీస్ అధికారి పని చేయాలని, బాధితుల ఫిర్యాదులపై విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు.

నేడు దివ్యాంగులకు జాబ్‌మేళా

మహబూబాబాద్: జిల్లా ఉపాధిశాఖ, యూత్ ఫర్ జాబ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఈనెల 21న జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జాబ్‌మేళా ఉంటుందన్నారు. 18 నుంచి 35సంవత్సరాలలోపు వయసు గల దివ్యాంగులు జాబ్‌మేళాను సద్వినియోగంచేసుకోవాలని కోరారు. వరంగల్, హైదరాబాద్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో పాటు రెండు పాస్‌ఫొటోలు తీసుకురావాలని కోరారు.

డీజీపీ వీడియో కాన్ఫరెన్స్



మహబూబాబాద్ రూరల్: రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్ సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నెలవారి నేర సమీక్ష నిర్వహించారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని డీజీపీతో మాట్లాడారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీలు రమణబాబు, రఘు, ఏఓ జయరాం, సూపరింటెండెంట్లు రమాదేవి, మహమూద్, ఆర్ఐ పూర్ణచందర్, డీసీఆర్‌బీ ఎస్సై ప్రవీణ్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

నెహ్రూసెంటర్: మానుకోట ఆర్టీసీ డిపోలో సెప్టెంబర్ 2014 కంటే ముందు ఉద్యోగంలో చేరిన ఉద్యోగులు, సెప్టెంబర్ 2014తర్వాత రిటైర్డ్ అయిన ఉద్యోగులందరూ హయ్యర్ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఎం విజయ్ సోమవారం తెలిపారు. ఉద్యోగులు తమ దరఖాస్తు ఫారాలతో పాటు ఉద్యోగ సంబంధిత పత్రాల మూడు సెట్ల జిరాక్స్ కాపీలను కార్యాలయంలో అందజేయాలన్నారు. సంతకాల అనంతరం పీఎఫ్ కార్యాలయం హైదరాబాద్‌కు మార్చి 3వ తేదీలోగా రిజిస్టర్ పోస్టు చేయాలన్నారు.

దుర్గమ్మతల్లి ఆశీస్సులు ఉండాలి



గూడూరు: ప్రజలందరిపై దుర్గమ్మతల్లి ఆశీస్సులు ఉండాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, ఎంపీ మాలోత్ కవిత వేడుకున్నారు. మండలంలోని బొల్లెపల్లిలో దుర్గమ్మగుడి వార్షిక పూజలకు సోమవారం ఎంపీ హాజరయ్యారు. ప్రజలు పాడి పంటలు, సుఖశాంతులతో సంతోషంగా ఉండాలని తల్లిని వేడుకున్నారు. అనంతరం గూడూరు ఎంపీపీ బానోత్ సుజాత తండ్రి ఈర్యానాయక్ ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకొని వారి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేం వెంకటక్రిష్ణారెడ్డి, గోపిశెట్టి చిన్న మల్లయ్య, చాపల నాగేశ్, ముత్యం వెంకన్న గౌడ్, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, పొన్నాల యుగంధర్, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి భయం!

మానుకోటలో నత్తనడకన మిషన్ భగీరథ పనులు

- డోర్నకల్‌లో పైపులైన్ల లీకేజీలు
- విలీన గ్రామాల్లో వేధిస్తున్న తాగునీటి సమస్య
- వేసవిలో నీటి కష్టాలు తీర్చాలంటున్న ప్రజలు



మహబూబాబాద్‌లో నిర్మాణంలో ఉన్న నీటి సరఫరా ట్యాంకు

సాక్షి, మహబూబాబాద్: వేసవి వచ్చిందంటే చాలు మొదటగా గుర్తొచ్చేది తాగునీటి సమస్య. జిల్లాలో ఏళ్లుగా ఈ సమస్య పరిష్కారం కావడం లేదు. అయితే మిషన్ భగీరథ పథకం ద్వారా అధికశాతం తాగునీటి కష్టాలు తీరినా.. మున్సిపాలిటీల్లోని కొన్ని ప్రాంతాల్లో తిప్పలు తప్పడం లేదు. కాగా అధికారులు వేసవిలో ఎలాంటి చర్యలు తీసుకుంటారు.. ప్రజల దాహార్తిని ఎలా తీరుస్తారు అనేది కీలకంగా మారింది.

ముందుకు సాగని పనులు..

మానుకోట పట్టణం జిల్లా కేంద్రంగా మారిన తర్వాత శరవేగంగా అభివృద్ధి చెందింది. ఇళ్ల నిర్మాణాలు, కాలనీలు ఏర్పడ్డాయి. అయితే దీనికి తగిన విధంగా తాగునీటిని సరఫరా చేయడంలో అధికారులు వెనకబడ్డారు. పట్టణంలో 69,288 జనాభా ఉండగా ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రతి మనిషికి రోజుకు 135లీటర్ల నీరు అవసరం. ఈ లెక్కన పట్టణంలో 93,53,880 లీటర్ల వినియోగం ఉంది. కానీ ప్రస్తుతం 62,98,710 లీటర్లు మాత్రమే సరఫరా చేస్తున్నారు. దీనికి తోడుగా అనధికారిక ఇళ్ల నిర్మాణం, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు మిషన్ భగీరథ నీరు సరఫరా చేస్తున్నారు. ఈ లెక్కన మరో 10లక్షల లీటర్ల మేరకు అదనంగా నీరు సరఫరా చేయాల్సి ఉంది. మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం, జమాండ్లపల్లి, బేతోలు, గాంధీపురం గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. పట్టణంలోని ధర్మన్నకాలనీ, హనుమంతరావు నగర్, రెడ్డిబజార్, కవిత కాలనీల్లోని కొన్ని వీధులకు నీటి సరఫరా కావడం లేదు. దీనిని అధిగమించేందుకు మహబూబాబాద్ పట్టణంలోని కంకరబోర్డులో 2000కేఎల్ సామర్థ్యం, గాయత్రి గుట్టవద్ద 1500 కేఎల్ సామర్థ్యం, నందన గార్డెన్ ప్రాంతంలో 500 కేఎల్ సామర్థ్యం గల ట్యాంకులు నిర్మిస్తున్నారు. అయితే ఈ నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. ఈ వేసవికి ముందుగా నిర్మాణాలు పూర్తి అయితే తాగునీటి సమస్య తీరేదని అధికారులు అంటున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు..

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. మహబూబాబాద్ పట్టణంలో నందనగార్డెన్ ప్రాంతంలోని సంప్‌వద్ద అదనపు మోటార్లు బిగించి ఎగువ ప్రాంతాలకు నీటి సరఫరా చేసేలా ప్రయత్నాలు చేస్తున్నారు. అదేవిధంగా డోర్నకల్ మున్సిపాలిటీకి ఇప్పటికే రూ.15లక్షలు కేటాయించారు. తొర్రూరు, మరిపెడ మున్సిపాలిటీల్లో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఇతర మున్సిపాలిటీల్లో..

తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉంది. పట్టణంలో 35,231జనాభా ఉంది. ఈ లెక్కల ప్రకారం 47,56,185 లీటర్ల తాగునీరు అవసరం. కానీ ప్రస్తుతం పట్టణంలో ఉన్న ట్యాంకులను రెండు సార్లు నింపి రోజుకూ 22,12,731 లీటర్లు మాత్రమే సరఫరా చేస్తున్నారు. కాగా పట్టణంలోని కంటాయపాలెం రోడ్డు, టీచర్స్‌కాలనీ, పాల కేంద్రం ప్రాంతాల్లోని కొన్ని చోట్ల పైపులైన్లు లేక నీటి సరఫరా కావడం లేదు. అదేవిధంగా డోర్నకల్ మున్సిపాలిటీలో రాజుతండా, ఎస్సీ, బీసీకాలనీ, పంపుబావి తండా, సుభాష్ వీధి ప్రాంతాలకు మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో బతకమ్మ చెరువులో వేసిన బోర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. నెహ్రూ స్ట్రీట్‌కు సక్రమంగా నీరు రావడం లేదు. పైపులైన్లు తరుచుగా పగలడంతో వారాల కొద్దీ నీటి సరఫరా నిలిపివేస్తున్నారు. అదేవిధంగా మరిపెడ మున్సిపాలిటీలోని హౌజింగ్ బోర్డు కాలనీ, మైనార్టీ కాలనీ, సీతారాంపురం ప్రాంతాల్లో కూడా నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

దండుపాళ్యం ముఠాగా మారారు!



మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి



సభకు హాజరైన జనం

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై రేవంత్‌రెడ్డి నిప్పులు

- కేసీఆర్, నరేంద్రమోదీల పాలనపై మండిపాటు
- వరంగల్ పశ్చిమ, తూర్పు ఎమ్మెల్యేలు బిల్లా.. రంగాలుగా అభివర్ణన
- విద్యార్థులు, మేధావులు, కార్మిక సంఘాలతో భేటీ
- సమస్యలు అడిగి తెలుసుకున్న రేవంత్
- కాజీపేట దర్గా నుంచి ఏనుగులగడ్డ వరకు సాగిన యాత్ర

సాక్షిప్రతినిధి, వరంగల్/హన్మకొండ చౌరస్తా: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, సీఎం కేసీఆర్, పీఎం నరేంద్రమోదీల పాలనపై టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి నిప్పులు చెరిగారు. అనేక ఆశలు, ఆకాంక్షలతో సాధించుకున్న తెలంగాణలో ప్రజల మనోభావాలు నెరవేరకపోగా.. ఏ వర్గం సంతృప్తిగా లేదన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా సోమవారం కాజీపేట దర్గా నుంచి హనుమకొండ చౌరస్తా సమీపంలో ఏనుగులగడ్డ వరకు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి యాత్ర నిర్వహించారు. అనంతరం ఏనుగులగడ్డ, అమృత జంక్షన్ వద్ద డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో మాజీ పీసీసీ అధ్యక్షుడు వి.హనుమంతరావు, మాజీ మంత్రి మహ్మద్ షబ్బీర్ అలీ తదితరులతో కలిసి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. వరంగల్ పశ్చిమ, తూర్పు ఎమ్మెల్యేలు బిల్లా.. రంగాలుగా మారి దోచుకుంటున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేగా దాస్యం ప్రణయ్‌భాస్కర్‌కు మంచి పేరుండెనని, ఆయన తమ్ముడిగా ప్రజల ముందుకు వచ్చిన వినయ్‌భాస్కర్ అన్నకు సున్నం పెట్టిండని, ఆయన కుటుంబ సభ్యులు ఎక్కడున్నారో తెలియదన్నారు.

కాజీపేట దర్గా నుంచి ఏనుగులగడ్డ వరకు...

రేవంత్‌రెడ్డి యాత్ర సోమవారం సాయంత్రం కాజీపేటలో ప్రారంభమైంది. ముందుగా కాజీపేటలోని హజ్రత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబాని దర్గాను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అక్కడి నుంచి హనుమకొండ కలెక్టర్ క్యాంపు కార్యాలయం సమీపంలోని లా కాలేజీ, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మీదుగా యాత్ర సాగింది. అమరవీరుల స్థూపం(అదాలత్ జంక్షన్) నుంచి కాళోజీ విగ్రహం, ఏకశిల పార్క్, ప్రెస్‌క్లబ్, హనుమకొండ కొత్త బస్టాండ్, శ్రీదేవి మాల్, అంబేడ్కర్ సర్కిల్, పోలీస్ హెడ్‌క్వార్టర్స్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, హనుమకొండ చౌరస్తా మీదుగా ఏనుగులగడ్డ వరకు సాగింది. ఈ సందర్భంగా తనను కలిసిన విద్యార్థులు, యువకులు, మేధావులు, అడ్వకేట్స్ జేఏసీ, కాకతీయ యూనివర్సిటీ జేఏసీ నాయకులతో మాట్లాడారు. ఆటో రిక్షా కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ములుగు ఎమ్మెల్యే సీతక్క, అంజన్‌కుమార్ యాదవ్, వేం నరేందర్‌రెడ్డి, మాజీ మేయర్ స్వర్ణ, మాజీ ఎంపీ రాజయ్య, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, మల్లు రవి, ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

'సీఎం.. సీఎం..' అంటూ నినాదాలు...

భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో ఏనుగులగడ్డ ప్రాంతం కిక్కిరిసిపోయింది. రేవంత్‌రెడ్డి సీఎం.. సీఎం అంటూ యువత పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. డప్పుచప్పుళ్లు, బోనాలతో మహిళలు రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికారు. కళాకారుల ఆటపాట కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉత్తేజాన్ని నింపాయి.

బీజేపీ నాయకులపై దాడి

- నైనాల గ్రామంలో ఘటన
- బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడి ఆధ్వర్యంలో దాడి చేసినట్లు ఆరోపణ
- ఎస్సైని సస్పెండ్ చేయాలని బీజేపీ నాయకుల ధర్నా



పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

నెల్లికుదురు: బీజేపీ నాయకులపై బీఆర్‌ఎస్ నాయకులు దాడి చేసిన ఘటన మండలంలోని నైనాల గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. ప్రజాగోస-బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా నైనాల గ్రామంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోతు హుస్సేన్ నాయక్ హాజరై మాట్లాడారు. ఈక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పెరుమాండ్ల ఉపేందర్ తన మోటారు సైకిల్‌తో మీటింగ్‌లోకి దూసుకొచ్చాడు. దీంతో బీజేపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 100కు ఫోన్ చేయడంతో ఎస్సై జితేందర్ పోలీసులతో వచ్చి ఉపేందర్‌ను స్టేషన్‌కు తీసుకెళ్లి వెంటనే వదిలేశారు. ఈ క్రమంలో ఉపేందర్ కొంతమంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు, గూండాలతో మళ్లీ వచ్చి తమపై కత్తులతో దాడి చేసినట్లు హుస్సేన్‌నాయక్ ఆరోపించారు. అనంతరం నైనాల నుంచి నేరుగా నెల్లికుదురుకు చేరుకున్న బీజేపీ నాయకులు పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి ధర్నాకు దిగారు. నిర్లక్ష్యంగా మాట్లాడిన ఎస్సై జితేందర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. తమపై దాడి చేసిన బీఆర్‌ఎస్ గూండాలను అరెస్టు చేయాలని, ఎస్పీ వచ్చే వరకు ధర్నా విరమించేది లేదని బీజేపీ నాయకులు భీష్మించి కూర్చున్నారు. స్థానిక ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మహబూబాబాద్‌లో బీజేపీ ఎదుగుదలను చూసి ఓర్వలేకనే తమపై దాడి చేయించారని హుస్సేన్ నాయక్ ఆరోపించారు. బీఆర్‌ఎస్ గూండాయిజం నశించాలని నినాదాలు చేశారు. ఈక్రమంలో అక్కడికి చేరుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచందర్‌రావు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ధర్నాను విరమింపజేశారు.

బీజేపీని ఓడించడమే లక్ష్యం

గార్ల: దేశం, రాష్ట్రంలో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న బీజేపీని ఓడించడమే లక్ష్యమని సీపీఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. సోమవారం గార్లలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఉపాధి హామీ పనులను నీరుగార్చేందుకు బడ్జెట్ నిధుల కేటాయింపులో కోత విధించారని మండిపడ్డారు. ఆహార సబ్సిడీ ఎత్తివేయడంతో దేశంలో ఆకలికేకలు వినిపిస్తున్నాయని అన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసిందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ పార్టీ తరపున ఎన్ని సీట్లు గెలుస్తాడో తెలియదు కానీ, దేశాన్ని పాలిస్తాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో అమలు చేసే సంక్షేమ పథకాలు బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులకు మాత్రమే కేటాయించడంపై మండిపడ్డారు. పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మండల కార్యదర్శి శ్రీనివాసరావు, ఉపేందర్‌రెడ్డి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కవిత, హరి, రాజారావు, పెద్దవెంకటేశ్వర్లు, ఈశ్వర్‌లింగం, గోవింద్ ఉన్నారు.

అధికార పార్టీ నాయకుడు నా భూమిని ఆక్రమించాడు

- యువకుడి ఆత్మహత్యాయత్నం
- తొర్రూరులో ఘటన



తొర్రూరులో చికిత్స పొందుతున్న యువకుడు

తొర్రూరు: వారసత్వంగా వస్తున్న భూమిని అధికార పార్టీకి చెందిన నాయకుడు అన్యాయంగా ఆక్రమించాడని మండలంలోని మాటేడు గ్రామానికి చెందిన వల్లపు శ్రీకాంత్(28) సోమవారం పురుగుల మందు తాగాడు. ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య పోరాడుతున్నాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మాటేడు గ్రామానికి చెందిన వల్లపు మల్లయ్యకు సర్వే నంబర్ 146/ఏ4/1 లో 3-32 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. కరోనా సమయంలో మల్లయ్య వైరస్ బారిన పడగా భార్య కూడా వదిలేసి వెళ్లింది. దీంతో అతడి యోగక్షేమాలు చూసే వారు కరువయ్యారు. ఆ సమయంలో సోదరుడి కుమారుడు వల్లపు శ్రీకాంత్ మల్లయ్యకు దగ్గరుండి సపర్యలు చేశాడు. రెండేళ్ల క్రితం కరోనాతో తీవ్ర అనారోగ్యం పాలై మల్లయ్య మృతిచెందగా సంతానం లేకపోవడంతో సోదరుడి కుమారుడు అయిన శ్రీకాంతే తలకొరివి పెట్టాడు. ఈ క్రమంలో మల్లయ్య భూమిపై కన్ను వేసిన బీఆర్‌ఎస్ నాయకుడు రామసహాయం కిషోర్ రెడ్డి, మాటేడు సర్పంచ్ భర్త వల్లపు యాకయ్య సహకారంతో సదరు భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నాడని బాధితుడు ఆరోపించాడు. సోమవారం గ్రామంలోని సదరు భూమిలో కడీలు పాతుతుండగా శ్రీకాంత్ అడ్డుకోబోగా కిషోర్‌రెడ్డి అనుచరులు తీవ్ర పదజాలంతో దూషించి చంపుతామని బెదిరించడంతో మనస్తాపంతో పురుగుల మందు తాగినట్లు బాధితుడు మీడియాతో పేర్కొన్నాడు. అపస్మారక స్థితికి చేరిన యువకుడిని స్థానికులు తొర్రూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దీనిపై అధికార పార్టీ నాయకుడు కిషోర్‌రెడ్డిని వివరణ కోరగా సదరు భూమిని ఏడాది క్రితమే మల్లయ్య భార్య రాజమ్మ దగ్గర కొనుగోలు చేసినట్లు తెలిపారు. యువకుడు ఆత్మహత్యాయత్నం ఘటనకు తనకు సంబంధం లేదన్నారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ శశాంక



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: ప్రజా సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా కలెక్టర్ శశాంక అదనపు కలెక్టర్లు డేవిడ్, అభిలాష అభినవ్ వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో అనేక సమస్యలపై ప్రజలు అందించిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఒకే సమస్యపై దరఖాస్తులు పునరావృతం కాకుండా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో పదో తరగతి వార్షిక పరీక్షలపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ప్రతి పాఠశాలలో ఉదయం 8.30నుంచి 9.30గంటల వరకు, సాయంత్రం 4.30నుంచి 5.30గంటల వరకు నిర్వహించాలన్నారు. విద్యాశాఖ ఒక్కో విద్యార్థికి స్నాక్స్ కోసం ప్రతిరోజు రూ.15కేటాయిస్తుందన్నారు. మండలాలు, గ్రావాల వారీగా జిల్లాలో హాస్టళ్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మహాశివరాత్రి సందర్భంగా కురవి జాతరను విజయవంతం చేసిన అధికారులను కలెక్టర్ శశాంక ప్రత్యేకంగా అభినందించారు.

వచ్చిన వినతుల్లో కొన్ని..

- కేసముద్రం మండలం కల్వల గ్రామంలోని గాంధీపురానికి చెందిన అంజయ్య భార్య అనారోగ్యంతో మృతి చెందింది. అయితే ఆమె పేరుమీద ఉన్న 1.23 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ కోసం స్లాట్‌బుక్ చేయగా సాంకేతిక సమస్యతో రిజిస్ట్రేషన్‌కావడం లేదని, ఆస్లాట్ రద్దు చేసి రిజిస్ట్రేషన్ చేయించాలని అంజయ్య వినతి ఇచ్చారు.
- గార్ల మండలం పుల్లూర్ గ్రామ పంచాయతీ ప్లీకాతండాకు చెందిన రేణుక తన భర్త కానిస్టేబుల్‌గా పని చేస్తూ ప్రమాదవశాత్తు మరణించారని, తన విద్యార్హతలను బట్టి ఉద్యోగ అవకాశంతో పాటు తన కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి అందజేశారు.
- కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన జ్యోతి తనకు బీసీ కార్పొరేషన్ రుణం మంజూరు చేయాలని వినతిలో కోరారు.

జీవితంలో విజయం..

కురవి: పదో తరగతి ఫలితాల ఆధారంగా జీవితంలో విజయం సాధించవచ్చని కలెక్టర్ శశాంక అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో పదో తరగతి విద్యార్థులకు మారిన పరీక్ష ప్రశ్నపత్రాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు టెన్ జీపీఏ సాధించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ రామారావు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

వీరన్న సన్నిధిలో ప్రభల ప్రదక్షిణలు



వీరభద్రస్వామి ఆలయంలో ప్రభల ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

కురవి: హైదరాబాద్‌లోని పార్శిగుట్టకు చెందిన (వీరముష్టి)వీరభద్రస్వామి ఆరాధకుల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి వీరభద్రస్వామి ఆలయంలో ప్రభల ప్రదక్షిణలు చేశారు. పార్శిగుట్ట నుంచి వీరభద్రీయ కుల సంఘం ఆధ్వర్యంలో 12 సంవత్సరాలుగా స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా ప్రభలను ప్రదర్శించారు. కార్యక్రమంలో రావుల సోమయ్య, మల్లూరి రాములు, రావుల ఎల్లయ్య, రావుల లింగయ్య, మిట్టపల్లి శ్రీనివాస్, జగదీశ్‌రాజ్, వెంకట్, శ్రీనివాస్, యాదగిరి, ఉప్పలయ్య, మహంకాళి రమేష్, ఉప్పలయ్య, మల్లూరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: బెస్ట్ అవైలబుల్ స్కూల్ (రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్) స్కీంలో భాగంగా 2023–24విద్యా సంవత్సరంలో ఉత్తమ పాఠశాలల ఎంపిక కోసం జిల్లాలోని ప్రైవేటు ఇంగ్లిష్ మీడియం పాఠశాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సన్యాసయ్య సోమవారం తెలిపారు. ఈ నెల 26వ తేదీలోపు దరఖాస్తులు జిల్లా కార్యాలయంలో సమర్పించాలన్నారు. వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పీసీ రాధికకు రివార్డు అందజేత



ఉమెన్ పీసీ రాధికకు రివార్డు అందజేస్తున్న ఎస్పీ

మహబూబాబాద్ రూరల్: కురవి జాతరలో భక్తురాలు బానోత్ నిర్మల విద్యుదాఘాతానికి గురికాగా ఆమెకు ప్రథమ చికిత్సచేసి ప్రాణాలు కాపాడిన ఉమెన్ పీసీ రాధికను ఎస్పీ శరత్‌చంద్రపవార్ సోమవారం అభినందించి రివార్డు అందజేశారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఆమెను అభినందించి ఎస్పీ మాట్లాడారు. కురవి భద్రకాళీ సమేత వీరభద్ర స్వామివారి కల్యాణ మండపంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన బానోత్ నిర్మల అనే భక్తురాలు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లిందన్నారు. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న గూడూరు పోలీస్‌స్టేషన్ ఉమెన్ పీసీ రాధిక ఇది గమనించి నోటి ద్వారా శ్వాస అందించి నిర్మల ప్రాణాలు నిలిపిందన్నారు. ప్రథమ చికిత్సచేసి భక్తురాలిని రక్షించిన ఆమెను అభినందించి క్యాష్ రివార్డు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, మహబూబాబాద్ ఇన్‌చార్జ్ డీఎస్పీ రమణబాబు, రూరల్ సీఐ సుంకరి రవికుమార్, కురవి ఎస్సై బి.రాము పాల్గొన్నారు.

సునీల్‌నాయక్ కుటుంబాన్ని ఆదుకుంటాం

- ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్



కలెక్టర్‌కు వినతి, లేఖలు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్, సునీల్‌నాయక్ కుటుంబ సభ్యులు

మహబూబాబాద్: జిల్లాలోని గూడూరు మండలానికి చెందిన సునీల్‌నాయక్ అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడని, అతడి కుటుంబాన్ని ఆదుకునే బాధ్యత తీసుకుంటానని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ హామీ ఇచ్చారు. సోమవారం ఎమ్మెల్యే స్వయంగా సునీల్‌నాయక్ తండ్రి, సోదరుడిని తన వెంట కలెక్టరేట్‌కు తీసుకెళ్లారు. కుటుంబాన్ని ఆదుకోవాలని కలెక్టర్ శశాంకను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. సునీల్‌నాయక్ సోదరుడు శ్రీనివాస్‌కు ఉద్యోగం కల్పించడంతో పాటు డబుల్ బెడ్రూం ఇల్లు, ఆర్థికసాయం అందించడంలో సహకరించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ విషయంలో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుకు లేఖలు పంపించామని, వారు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు లేఖలు పంపారన్నారు. కాగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి విషయం రాజకీయం చేసేవారు ఆరోపణలు చేస్తూనే ఉంటారని, ప్రజల దీవెనలతో ప్రభుత్వంలో ఉన్న తాము ప్రజా సంక్షేమాన్ని బాధ్యతగా భావించి పని చేస్తున్నామని చెప్పారు.

క్లుప్తంగా

భర్తపై హత్యాయత్నం

- ప్రాణాపాయ స్థితిలో ఉమేష్
- భార్యతో సహా నలుగురిపై కేసు నమోదు



దేవరుప్పుల : ఓ భర్తపై భార్యతో పాటు ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన సోమవారం చిన్నమడూరులో చోటుచేసుకుంది. ఎస్సై మునావత్ రమేష్ నాయక్ కథనం మేరకు.. మండలంలోని చిన్నమడూరుకు చెందిన కూరాకుల ఉమేష్‌తో లింగాలఘణపురం మండలం క్లౌంకు చెందిన మానుపాటి స్రవంతికి ఏడాది కిందట వివాహమైంది. గత కొంతకాలంగా వీరి మధ్య గొడవలు జరుగుతుండడంతో భార్య పుట్టింట్లోనే ఉంటుంది. ఈ క్రమంలో భార్య స్రవంతి, తల్లిదండ్రులు రాములమ్మ, కుమార్, మేనమామలు ఎలేందర్, ఆంజనేయులు కలిసి సోమవారం ఉదయం ఉమేష్ ఇంటికి వచ్చి కత్తులతో దాడికి పాల్పడి తీవ్రంగా గాయపర్చారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఉమేష్‌ను జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. తండ్రి కూరాకుల యాదయ్య ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మందుపాతరను నిర్వీర్యం చేసిన పోలీసులు



వెంకటాపురం(కె): మండల పరిధిలోని పామునూరు సమీపంలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతరను పోలీసులు నిర్వీర్యం చేశారు. సోమవారం ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్ కథనం ప్రకారం.. గ్రామసమీపంలోని అటవీ ప్రాంతంలో పోలీసులను హతమార్చేందుకు మావోయిస్టులు ఈ నెల 17న మందుపాతర అమర్చినట్లు వచ్చిన పక్కా సమాచారం మేరకు వెంకటాపురం సీఐ శివ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సై తిరుపతిరావు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, స్పెషల్ పార్టీ, బాంబ్ డిస్పోజల్ టీమ్‌తో కలిసి పామునూరు సమీపంలోని అట వీ ప్రాంతానికి వెళ్లినట్లు తెలిపారు. అటవీప్రాంతంలో బాంబ్‌ను గుర్తించేందుకు కూంబింగ్ చేస్తుండగా రోడ్డుపై విద్యుత్ తీగలు కనిపించాయి. దాన్ని పరిశీలించుకుంటూ వెళ్లారు. అది పామూనూరు సమీపంలోని అటవీప్రాంతంలోకి వెళ్లిందని తెలిపారు. అటవీప్రాంతంలో బీర్ బాటిల్‌బాంబ్‌ను గుర్తించినట్లు తెలి పారు. తక్షణమే బాంబ్ డిస్పోజల్ బృందాలు బాంబ్‌ను నిర్వీర్యం చేసినట్లు పేర్కొన్నారు. బాంబ్‌ను అమర్చిన మావోయిస్టు అగ్రనేతలపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



తేనెలొలుకు.. తెలుగు భాష

మాతృభాషకు గౌరవం పెంచుదాం..

- వక్తిత్వవికాసానికి తెలుగు తప్పనిసరి
- నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

జనగామ : అమ్మఒడి మాతృభాష గొప్పదనాన్ని అందిస్తుంది. చిన్న తనంలోని కమ్మనైన జోల పాటలు... నీతి పద్యాలు పిల్లల ఎదుగుదలలో పొరులుగా తయారు చేస్తుంది. కానీ ఎక్కడ చూసినా యాంత్రిక విద్యకు ఇచ్చిన ప్రాధాన్యతను.. విలువలు నేర్పే మాతృభాష(తెలుగు)కు ఇవ్వడం లేదు. మంగళవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం పురస్కరించుకుని సాక్షి ప్రత్యేక కథనం. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచంతో పోటీ పడుతున్నామని మురిసిపోవడమే తప్ప... జీవిత పాఠాలు, క్రమశిక్షణ నేర్పించే మన మాతృభాష తెలుగును మరచిపోతున్నాం. దీంతో ఎన్నో రకాల దుష్పలితాలను సమాజం అనుభవిస్తున్నది. విలువైన విద్యను కాపాడగలిగే ప్రయత్నం చేస్తూ, మానవతా సిరులను మాతృభాష ద్వారా పెంపొందించగలగాలి. విద్య వ్యక్తిత్వాన్ని నేర్పించి, పది మందికి ఉపయోగపడే వ్యక్తిగా తీర్చిదిద్దగలగాలి. నేటి ఆధునిక ప్రపంచంలో తనకు తాను గొప్పగా బతికితే చాలు, పది మంది జీవితం మాకెందుకు అనే ధోరణిలో చాలామంది ఉంటున్నారు.

మాతృభాష ఆదరణ తగ్గిందా...!

శ్రీకృష్ణదేవరాయల కాలంలో వెలుగు వెలిగిన తెలుగు భాషకి నేడు కొంత ఆదరణ తగ్గిందనే అనిపిస్తుంది. దీనికి ప్రధాన కారణం ఉన్నతమైన ఉద్యోగం సంపాదించాలంటే ఆంగ్లమే ప్రధానమనే భావన పాతుకుపోయింది. ఆంగ్లం అవసరం ఉన్నప్పటికీ, అదొక్కటే చాలదు. విషయ పరిజ్ఞానం అవసరం. మాతృభాష ద్వారానే అన్న సంగతి నేటితరం యువతీ, యువకులు అర్థం చేసుకోలేకపోతున్నారు. హైదరాబాద్ వంటి మహానగరాల్లో ఆంగ్లం అనర్గళంగా మాట్లాడే వ్యక్తులు వేలాదిగా కనిపిస్తారు. కానీ ఇందులో చాలా మందికి ఉన్నతస్థాయి ఉద్యోగాలు రావడం లేదు. ఎందుకంటే విజ్ఞాన సముపార్జన కలిగిన వారు మాత్రమే ఉన్నతస్థాయికి చేరుకుంటున్నారు. వ్యక్తిత్వ వికాసానికి మాతృభాష బోధన ఉపకారం ఎంతో ప్రాధాన్యమైంది.



మాతృభాషను కాపాడుకునేందుకు సూచనలు

- పాఠశాలల్లో మాతృభాషకు ప్రాధాన్యత పెంచాలి.
- అమ్మ ఒడి నుంచి ఇంగ్లీష్ రైమ్స్‌తో పాటుగా, అంతకంటే ఎక్కువగా విలువైన తెలుగు బాలగేయాలను ప్రతి మాతృమూర్తి నేర్పగలగాలి.
- ప్రతి తెలుగు పౌరుడు, పౌరురాలు మాతృభాషను తమ శ్వాసగా చేసుకోగలగాలి.
- దుకాణాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, మొదలైనవి తెలుగులోనే రాయాలి.
- తెలుగు భాషపై ఆసక్తిని పెంచే ఉపాధ్యాయుల ప్రయత్నానికి సహకరించాలి.

మాతృభాష గొప్పదనం తెలుసుకోవాలి



పిల్లల మానసిక వికాసానికి దోహదపడే మాతృభాషలోని నీతి కథలు, సూక్తులు, మంచి విషయాలు పిల్లలకు నేర్పించడం లేదు. ఆంగ్లంపై పెరుగుతున్న మోజుతో తల్లిదండ్రులతో పాటు విద్యాలయాల్లో సైతం మాతృభాషను కొద్దో గొప్పో మాట్లాడడం తప్ప... మెజార్టీ పిల్లలు తెలుగులో అమ్మా అని రాయలేకపోతున్నారు.

– త్రిపురారి పద్మ, తెలుగు పండిట్, రచయిత్రి, జనగామ

మాతృభాష మనిషికి ప్రాణవాయువు



ఆధునిక మానవ వికాసం ఊహలకు అందకుండా దూసుకుపోతోంది. నాగరికత కొత్త పుంతలు తొక్కుతోంది. మానవీయ బంధాలు క్రమంగా శిథిలమవుతున్నాయి. సెల్‌ఫోన్ పుణ్యమా అని తమ సమయాన్ని సోషల్ మీడియాకే కేటాయిస్తున్నారు. భాషా ప్రయోగంలో దేశీయత ఉట్టిపడేలా వర్తమాన రచయితలు తమ రచనల్లో కవితాభివృద్ధి కళా సుందరంగా ఉండేటట్లు ప్రయత్నించాలి.

– పానుగంటి రామమూర్తి అధ్యక్షుడు, తెలంగాణ రచయితల సంఘం

జీవన విధానానికి మూలాధారం..



మన సంస్కృతీ, సంప్రదాయాలు, జీవన విధానానికి మూలాధారం మాతృభాష అవసరం. మనిసి తన జీవితంలో ప్రయత్నంగా తల్లి ఒడి నుంచి నేర్చుకోవాలి, అమ్మ భాషను అమ్మను కాపాడుకున్నట్టే. ఇతర బాషలను నేర్చుకుంటూనే... తెలుగు భాషను గౌరవిద్దాం. భాషా పరిరక్షణకు ప్రాథమిక విద్య నుంచే విద్యా బోధన మరింత పటిష్టం కావాలి.

– వసంత, ఉపాధ్యాయురాలు, రచయిత్రి, జనగామ

మార్కెట్‌లోని సమస్యలు పరిష్కరించాలి

- ఏనుమాములలో కొత్త లైసెన్స్‌లు, మడిగెలను నిర్మించాలి
- మౌలిక వసతులు కల్పించాలి
- మార్కెటింగ్ డైరెక్టర్‌ను కలిసిన చాంబర్ ప్రతినిధులు



మార్కెటింగ్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చాంబర్ ప్రతినిధులు

వరంగల్ : వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, కొత్త అడ్తి లైసెన్సుల జారీ, అపరాల షట్టర్ల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయిని వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, అడ్తి కమీషన్, ఏజెంట్స్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం పెంటయ్య, అడ్తి సెక్షన్ అధ్యక్షుడు ఎస్‌రెడ్డి లింగారెడ్డి కోరారు. సోమవారం హైదరాబాద్‌లో మార్కెటింగ్ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ మార్కెట్‌లోని ప్రాథమిక చికిత్స కేంద్రం విస్తరించి, టాయిలెట్స్‌ను నిర్మించాలని, అదే విధంగా ఛాంబర్‌కు గతంలో కేటాయించిన 35 గుంటల స్థలంపై ఉన్న లీజు తీసివేయాలని కోరారు. 194 క్యూ సెక్షన్‌తో అడ్తిదారుల నుంచి వసూలు చేస్తున్న టీడీఎస్ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. బార్దాన్ చెల్లింపుల కోసం ఖమ్మం వ్యవసాయం మార్కెట్‌లో అనుసరిస్తున్న పద్ధతులను పరిశీలించి వచ్చిన తర్వాత సమస్య పరిష్కారానికై సమీక్షా సమావేశం ఏర్పాటు చేయడంలో జాప్యం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. అదే విధంగా ఇంటిగ్రేటెడ్ వేయింగ్ మిషన్లు పనిచేయడం లేదని, తగినన్ని అందుబాటులో లేకపోవడంతో రైతు సరుకుల తూకంలో జాప్యం జరుగుతోందన్నారు. తాము తెలిపిన అన్ని సమస్యలపై సానుకూలంగా స్పందించి ఒక నెల రోజుల్లో పైన వివరించిన అన్ని సమస్యలను పరిష్కరిస్తానని మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి హామీ ఇచ్చినట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు.

లోన్ ఇస్తామని సైబర్ మోసం

- రూ. 1.15 లక్షలు కాజేత

స్టేషన్‌ఘన్‌పూర్: లోన్లు ఇస్తామని నమ్మబలికి మండలంలోని మీదికొండకు చెందిన మ్యాదారపు కేదారి బ్యాంకు అకౌంట్ నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1,15,224 కాజేసిన సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. సీఐ రాఘవేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మీదికొండకు చెందిన చిదురాల పద్మకు గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. ప్రభుత్వం ద్వారా మీకు లోన్ వస్తుందని, మీ బ్యాంకు అకౌంట్ నంబర్, గుగూల్ పే, ఫోన్ పే నంబర్ ఇవ్వాలని అడిగాడు. ఇందుకు ఆమె తనకు బ్యాంకు ఖాతా లేదని, ఇంటి సమీపాన ఉండే మ్యాదారపు కేదారికి ఉందని, అతడికి ఫోన్ కలిపింది. దీంతో సైబర్ నేరగాడు ఫోన్‌కు ఒక లింకు పంపిస్తామని, దాన్ని క్లిక్ చేస్తే మీకు డబ్బులు అకౌంట్‌లో పడుతాయని నమ్మబలికాడు. దాంతో కేదారి తన ఫోన్‌కు, గుగూల్ పేకి వచ్చిన లింక్‌ను క్లిక్ చేయగా పలుమార్లు అతడి ఖాతా నుంచి మొత్తం రూ.1,15,224 కాజేసినట్లు తెలిపారు. ఈ విషయమై బాధితుడు అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు పంపే లింక్‌లను క్లిక్ చేయవద్దన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930లో ఫిర్యాదు చేయాలన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



మహబూబాబాద్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డీసీపీ బారి, తదితరులు

- వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారి
- జేఎన్‌ఎస్‌లో ముగిసిన వరంగల్ సిటీ బాస్కెట్‌బాల్ లీగ్

వరంగల్ స్పోర్ట్స్: క్రీడల్లో రాణిస్తే శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండడమే కాకుండా ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారి యువతను ఉద్దేశించి అన్నారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండ్రోజుల పాటు జరిగిన వరంగల్ సిటీ బాస్కెట్‌బాల్ లీగ్ టోర్నమెంట్ ఆదివారం రాత్రి ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీపీ బారి హాజరై క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. పట్టుదల, క్రమశిక్షణతో అనుకున్న క్రీడల్లో సాధన చేస్తే ఉన్నత స్థానాలను చేరుకునేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. తాను కూడా క్రీడాకారుడిగా క్రీడా కోటలోనే పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించానని తెలిపారు. వ్యసనాలకు లోబడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. సీనియర్ మెన్ కేటగిరీలో నిర్వహించిన పోటీలకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 10 జట్లు హాజరు కాగా.. విజేతగా మహబూబాబాద్ జట్టు, రన్నరప్‌గా వరంగల్ ఎల్‌బీ కాలేజీ జట్టు నిలిచింది. కాగా.. మూడోస్థానంలో జేఎన్‌ఎస్, కేసముద్రం జట్లు జాయింట్ విన్నర్స్‌గా నిలిచాయి. కార్యక్రమంలో కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విజయసారథి, వరంగల్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, మహబూబాబాద్ ఎస్‌ఐ క్రాంతికిరణ్, డీఎస్‌ఏ బాస్కెట్‌బాల్ కోచ్ ప్రశాంత్, భాస్కర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బోరు పంచాయితీ

- అటవీ అధికారులు, రైతు కుటుంబం మధ్య పోరాటం
- బోరులో రాళ్లు వేశారని ఆందోళన
- డీఆర్వోపై పోలీసులకు ఫిర్యాదు



పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేస్తున్న రైతు కుటుంబం

బయ్యారం : మండలంలోని చర్లపల్లి సమీపంలోని వ్యవసాయ భూమిలో ఆరేళ్ల క్రితం ఏర్పాటు చేసిన బోరు నీటివాడకంపై అటవీ అధికారులు, రైతు కుటుంబం మధ్య వివాదస్పదంగా మారింది. చర్లపల్లి సమీపంలో జగ్నాతండాకు చెందిన వాంకుడోత్ శ్రీను–వినోద దంపతులకు వారసత్వంగా 2.20 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలో పంటలు సాగుచేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో ఆ భూమి సమీపంలో ఆరేళ్ల క్రితం అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు పెంచేందుకు నర్సరీని ఏర్పాటు చేశారు. మొక్కల కోసం అవసరమైన నీటిని శ్రీను భూమిలో బోరును తవ్వి మోటార్ ద్వారా ఇరువురు వాడుకునే విధంగా మోటార్‌ను బిగించారు. కొన్నేళ్ల వరకు అటవీ అధికారులు, రైతు కుటుంబం మధ్య సఖ్యతగా కొనసాగిన బోరు నీటి వినియోగం సంవత్సర కాలంగా వివాదాలతో నడుస్తోంది. తమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోర్‌నీటిని వినియోగించొద్దని అటవీశాఖ డీఆర్వో నాగమణి ఆధ్వర్యంలో అటవీ సిబ్బంది బోర్ మోటర్‌తో పాటు వైర్లు, స్టాటర్‌ను తొలగించారు. దీంతో రైతు కుటుంబం కొత్తగా మోటార్, వైర్లు, స్టాటర్‌ను ఏర్పాటు చేసుకొని మొక్కజొన్న పంటకు నీరందిస్తున్నారు. విషయం తెలుసుకున్న డీఆర్వో తమ బోరు వద్దకు సిబ్బందితో వచ్చి అందులో రాళ్లు వేసిందని రైతు కుటుంబం పేర్కొంది. తమ బోరులో రాళ్లు వేసిన డీఆర్వోపై చర్యలు తీసుకోవాలని సోమవారం రైతు కుటుంబం బయ్యారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పురుగుల మందు డబ్బాతో ఆందోళన....

తమ బోరులో రాళ్లు వేసిన డీఆర్వోపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరుతూ రైతు శ్రీను తన కుటుంబ సభ్యులతో కలిసి బయ్యారంలోని అటవీశాఖ కార్యాలయం ఎదుట పురుగుల మందు డబ్బాతో ఆందోళనకు దిగారు. తమకు న్యాయం జరగకపోతే పురుగుల మందు తాగుతామని పేర్కొనడంతో పోలీసులు జోక్యం చేసుకొని వారిని వారించి పంపించారు. ఈ విషయంపై అటవీ అధికారులు మాత్రం తమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోరుపై తమకే హక్కు ఉందన్నారు. కావాలనే రాద్ధాంతం చేస్తూ తమను బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొంటున్నారు.

పాముకాటుకు మహిళ మృతి

భూపాలపల్లి రూరల్: వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కరిచి మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని గోర్లవీడులో చోటు చేసుకొంది. గ్రామస్తులు వ్యవసాయ కూలీలు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షాజహాన్‌బీ(40) రోజువారీగా కూలీలతో కలిసి పత్తి ఏరడానికి వెళ్లింది, ఈ క్రమంలో పాము కరవడంతో తోటి కూలీలు చికిత్స నిమిత్తం భూపాలపల్లి జిల్లా కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించినట్లు తెలిపారు. మృతురాలకు భర్త లాల్ పాషా, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కంప్రెషర్ ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి..

ధర్మసాగర్: మండలంలోని ముప్పారం శివారులో గ్రానైట్ క్వారీలో కంప్రెషర్ ట్రాక్టర్ బోల్తాపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. నల్గొండ జిల్లాకు చెందిన ఆలకుంట్ల ఇద్దయ్య కొద్ది రోజుల క్రితం గ్రానైట్ క్వారీలో పని చేయడానికి వచ్చాడు. సోమవారం ఉదయం ఇద్దయ్య కాంప్రెషర్ ట్రాక్టర్‌తో గుట్టపైకి వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. దీంతో ఆయన ట్రాక్టర్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పండుగకు వచ్చి.. అనంతలోకాలకు

- రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి



శివ(ఫైల్)



మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

సంగెం: మహాశివరాత్రి సెలవులకు ఇంటికి వచ్చిన విద్యార్థి తిరిగి హాస్టల్‌కు వెళ్తూ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పర్వతగిరి మండలం మాల్యాతండా శివారు పంచరాయి తండాకు చెందిన బానోత్ వెంకన్న–భారతి దంపతులకు ఇద్దరు కూతుళ్లు నాగేశ్వరీ, రాజేశ్వరీ, కుమారుడు శివ ఉన్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న వెంకన్న కుమారుడు శివను పున్నేలు శివారు ఏకశిల పాఠశాలలో 4వ తరగతి చదివిస్తున్నాడు. మహాశివరాత్రికి సెలవు రావడంతో కుమారుడిని ఇంటికి తీసుకుని వచ్చారు. తిరిగి హాస్టల్‌లో దింపి రావడానికి తండ్రి వెంకన్న తన ద్విచక్ర వాహనంపై శివ (12)ను వెనుక కూర్చుండబెట్టి వెళ్తున్న క్రమంలో సంగెం మండలం గవిచర్ల దాటగానే ఓ కోళ్ల ఫారం సమీపంలో తూర్పుకోటకు చెందిన గోక వినయ్‌కుమార్ టాటాఏస్ గూడ్స్ వాహనాన్ని అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఈ సంఘటనలో వెనకాల కూర్చున్న శివ ఎగిరి రోడ్డుపై పడడంతో అతని తలపై నుంచి టాటాఏస్ వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రికి స్వల్ప గాయాలయ్యాయి.

మిన్నంటిన రోదనలు

ఇద్దరు కూతుళ్లు జన్మించగా వారసుని కోసం ఎదురు చూస్తే మూడో సంతానంగా పుట్టిన కుమారుడికి శివ అని ముద్దుగా పిలుచుకుంటున్నారు. ఉన్నత చదువులు చదివి కుటుంబాన్ని ఉద్ధరిస్తాడనుకుంటే అర్ధంతరంగా కానరాని లోకాలకు వెళ్లాడని, మంచిగా చదువుకుంటానని చెప్పి టాటా చెప్పి వెళ్లిన కాసేపటికే తిరిగిరాని లోకాలకు వెళ్లావా బిడ్డా అని తల్లితండ్రులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడిపెట్టించింది. మృతుడి తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్సై రాజేష్‌రెడ్డి తెలిపారు.

పట్టపగలే భారీ చోరీ...

- 9 తులాల బంగారం, 20 తులాల వెండి, నగదు అపహరణ



చోరీకి గురైన ఇంట్లో విచారణ చేపడుతున్న ఏసీపీ, సీఐ

జనగామ: జనగామలో దొంగలు పట్టపగేలే చోరీకి పాల్పడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రధానద్వారం తాళం పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. సీఐ ఎలబోయిన శ్రీనివాస్, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని వాసవీకాలనీ ఫేస్–2లో నివాసముంటున్న శివగారి కిరణ్, రజని ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు. రోజులాగే ఉదయం భార్యాభర్తలు స్కూల్‌కు వెళ్లిపోయారు. అదే ఇంట్లో పైఅంతస్తులో అద్దెకు ఉంటున్న ఉద్యోగి సైతం లేకపోవడంతో ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించిన దొంగలు..తలుపుకు వేసిన తాళం పగులగొట్టి లోపలికి వెళ్లారు. స్కూల్ ముగిసిన తర్వాత సాయంత్రం 5 ఇంటికి వచ్చిన దంపతులు తలుపులు తీసి ఉండడంతో ఆందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఏసీపీ దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాస్ అక్కడికి చేరుకున్నారు. డాగ్‌స్క్వాడ్, వేలిముద్రల నిపుణులు పిలిపించి విచారణ చేపట్టారు. 9 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి, రూ.40వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుల వాంగ్మూలం మేరకు ఫిర్యాదు స్వీకరించి విచారణ ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

త్రైమాసిక పన్నులు వెంటనే చెల్లించాలి

- స్వచ్ఛందంగా చెల్లిస్తేనే పెనాల్టీలో రాయితీ
- ఎంవీఐ వెంకన్న



జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంవీఐ వెంకన్న

ఖిలావరంగల్: ట్రాన్స్‌ఫోర్ట్ వాహనాలకు చెల్లించాల్సిన త్రైమాసిక పన్నులు సకాలంలో చెల్లించాలని లేకుంటే 200 శాతం ఫెనాల్టీలు తప్పదని వరంగల్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) వెంకన్న హెచ్చరించారు. వరంగల్ డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్ట్ కమిషనర్ పురుషోత్తం ఆదేశాలు, వరంగల్ ఆర్టీఓ అఫ్రీన్ సిద్దిఖీ సూచనల మేరకు సోమవారం వరంగల్ రవాణాశాఖ అధికారుల ఆధ్వర్యంలో జాతీయ రహదారులపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. రహదారులపై ట్రాన్స్‌ఫోర్ట్ వాహనాలను గుర్తించి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ట్యాక్సీలు చెల్లించని వాహనాలను సీజ్ చేసి ఆర్టీఏ కార్యాలయానికి తరలించారు. అనంతరం ఎంవీఐ వెంకన్న మాట్లాడుతూ ట్రాన్స్‌ఫోర్ట్ వాహనాలకు త్రైమాసిక ట్యాక్స్ చెల్లించకుండా యథేచ్ఛగా తిరుగుతున్న వాహనాలపై కొరఢా ఝుళిపించామని తెలిపారు. వాహన దారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ట్యాక్సీలు చెల్లిస్తే ఫైనాల్టీలో 50 శాతం రాయితీ కల్పిస్తున్నామని తెలిపారు.స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడితే 200 శాతం ఆదనంగా పెనాల్టీ కట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎంవీఐ శాలిని, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- 50 కిలోల ఎండుగంజాయి పట్టివేత
- విశాఖపట్నం టు మహారాష్ట్ర తరలింపు
- రెండు కార్లు, బొలెరో ట్రక్ స్వాధీనం..
- ఐదుగురు నిందితుల అరెస్ట్, మరో నలుగురు పరార్
- వివరాలు వెల్లడించిన తొర్రూరు డీఎస్పీ



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘు

మరిపెడ : మరిపెడ పట్టణం గుండా పెద్ద మొత్తంలో గంజాయి తరలిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న స్థానిక సీఐ ఎస్.సాగర్ ఆధ్వర్యంలో తనిఖీ చేపట్టారు. పట్టణ కేంద్రంలోని ఆర్‌జేఆర్‌ఎం కళాశాల మైదానంలో అనుమానితంగా ఉన్న వ్యక్తులకు పట్టుకొని రూ.7.50 లక్షల విలువ గల 50 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం పర్చుకున్నారు. ఎస్కార్ట్‌గా తరలిస్తున్న రెండుకార్లు, గంజాయి తరలిస్తున్న బొలెరో ట్రక్ వాహనాన్ని స్వాధీనం చేసుకుని ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో తొర్రూర్ డీఎస్పీ వివరాలను సోమవారం వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా బోడుప్పల్ పీర్జాదిగూడ శంకర్‌నగర్‌కు చెందిన గంధసిరి నాగరాజు, చల్లమల్ల కంట్లమయ్య, నరేష్ వీరు ముగ్గురు కలిసి గతంలో నాగరాజుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం మండలం రత్తంపేట శ్రీనివాస్‌కు పరిచయం ఉంది. ఈ పరిచయం కారణంగా అక్కడ శ్రీనివాస్‌తో కలిసి అన్నవరం దగ్గర కత్తిపూడి వద్ద రూ.5 వేలు కిలోగంజాయి చొప్పున 50 కిలోల ఎండు గంజాయిని సుమారు రూ.2.50 లక్షలకు కొనుగోలు చేసుకున్నారు. ఈ గంజాయిని నాగరాజుకు చెందిన టీఎస్ 07ఈయు7823 కారులో కొంత దూరం వరకు తరలించారు. దొరకకుండా ఉండేందుకు కొండ తేజ్‌కుమార్ బొలెరో ట్రక్‌ను కిరాయికి మాట్లాడుకున్నారు. ట్రక్‌లోని డ్రైవర్ సీటు వెనుకాల, క్యాబిన్ రూఫ్‌టాప్‌లో ప్రత్యేకంగా తయారు చేయించిన చాంబర్‌లో గంజాయి ప్యాకెట్లను లోడ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్ నుంచి మహారాష్ట్ర తరలింపు..

మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లా బర్సీకి చెందిన సంతోష్‌రాజ్ వ్యాపారితో ఎండుగంజాయిని కిలో రూ.15 వేల చొప్పున అమ్మడానికి బేరం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో సదురు వ్యాపారి సంతోష్‌రాజ్ తన అనుచరులైన రామకృష్ణ మాధవ రావు పోట్‌దార్, పాండురంగ్ సోమనాథ్ సోన్వనిలను హైదరాబాద్ నుంచి టాటా జెస్ట్ కారులో నిందితుడు నాగరాజుతో కలిసి వచ్చి మరిపెడ ఆర్‌జేఆర్‌ఎం కళాశాల వద్దకు ఈ నెల 19న మధ్యాహ్నం 3 గంటల సమయంలో చేరుకున్నారు. అప్పటికే అక్కడికి ఓ కారు, బొలెరో ట్రక్‌లో వచ్చిన చల్లమల్ల కంట్లమయ్య, నరేష్, కొండ తేజ్‌కుమార్, అంగడి రవిలను కలుసుకున్నారు. వ్యాపారం ఒప్పందంలో భాగంగా బొలెరో ట్రక్ నుంచి గంజాయి ప్యాకెట్లను హైదరాబాద్ నుంచి వచ్చిన టాటా జెస్ట్ కారులోకి మారుస్తున్న క్రమంలో పోలీసులు నిఘా వేసి పట్టుకున్నారు. ఈ క్రమంలో కొండ తేజ్‌కుమార్, నరేష్‌లు తప్పించుపోగా, మరో ఐదుగురిని వెంబడించి పట్టుకున్నారు. వారి నుంచి సుమారు 7.50 లక్షల విలువ గల 50 కిలోల ఎండు గంజాయి. మూడు వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన ఐదుగురిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. కొండ తేజ్‌కుమార్, నరేష్, శ్రీనివాస్, సంతోష్‌రాజ్ పరారీలో ఉన్నట్లు డీఎస్పీ వెల్లడించారు. ప్రధాన నిందితుడైన నాగరాజుపై గతంలో వివిధ ఆరు కేసుల్లో నిందితుడిగా పట్టుబడినట్లు తెలిపారు. సమావేశంలో మరిపెడ సీఐ ఎస్.సాగర్, ఎస్సైలు పవన్‌కుమార్, ఝాన్సీ, సంతోష, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

- HMDA Approved Open Plots for Sale at Ghatkesar, BibiNagar. Contact Cell: 9000182326 / 9705694440. [H-792739]

SERVICES

- వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టెకోవర్ లోన్స్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా రుణానికి వర్తిస్తాయి. సంప్రదించండి: 9463846068. [T-1745]

FINANCE

- హౌజ్, ఫ్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ వారికి చేయబడును. హన్మకొండ. సెల్: 7842279342. [WA-6484]

WANTED

- మా సంస్థలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. 8 గం॥ 12 గం॥ డ్యూటీలు కలవు. జీతం: 12000–15000. సంప్ర॥ 9703637320. [W-1170522]
- ప్రముఖ కృష్ణవేణి రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్, నక్కలగుట్ట, హన్మకొండలో కావలెను. (1) Asst. వంట మాస్టర్, (2) ఆటో ట్రాలీ డ్రైవర్, (3) ఆయాలు, (4) వాచ్‌మెన్ అర్జెంటుగా కావలెను. 9949610729. [WA-6496]
- Wanted Sales Executive for Delicious Farms Chicken Outlets in Warangal Required Sales Related Experience in any Domain. Salary + Bonus. Age: 25-35 yrs. Timings: 8 AM - 7 PM. Cont: 8106112401 [W-775827]
- వరంగల్‌లోని కిరాణం షాప్ నందు పని చేయుటకు 3 సం॥ల అనుభవం కల్గిన (స్త్రీ/పు) కావలెను. వరంగల్ లోకల్ వారు మాత్రమే సంప్రదించండి. యువరాజ్ కిరాణం, వరంగల్. 9490133696 [W-775830]
- ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్ టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10–15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781830]
- స్టార్ హోమ్ కేర్ Hyd. లో వృద్ధులకు, పేషంట్లకు సేవ చేయుటకు. బేబీకేర్, ఇంటి / వంట పని కి స్త్రీ/పు, లేడీ టెలీకాలర్స్ కావలెను. జీతం: 16,000/- నుండి 25,000/- రూం + భో. ఫ్రీ. ఫోన్: 7801099881, 8639828228 [V-775156]
- షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీవార్డెన్స్, లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు, వాచ్‌మెన్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-9790]
- విజయ హోం కేర్ HYDలో పెద్దవారికి సేవ చేయుటకు, బేబి కేర్, పేషెంట్ కేర్, ఇంటి/వంట పని కి స్త్రీ/పు, కావలెను. జీ: 16000-25000 (ఏజెంట్ కమీషన్ కలదు), రూం + మీల్స్ ఫ్రీ. 9491367222. [H-793511]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9505507558
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com